తప్పించుకొని తిరుగుతున్నాడని..
భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన

- ఏడాది క్రితం ప్రేమ వివాహం
- ప్రస్తుతం భార్యకు మానసిక వేధింపులు

కుటుంబ సభ్యులతో కలిసి రాకేశ్ ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న భాగ్య

లింగంపేట, మార్చి 21: ప్రేమించి పెండ్లి చేసుకున్న ప్రియుడు.. ప్రస్తుతం తనను తప్పించుకొని తిరుగుతున్నాడని భార్య ఆందోళనకు దిగిన ఘటన మండలంలోని కోమట్‌పల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. బాధితురాలు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. లింగంపేట మండలంలోని కేశాయిపేట గ్రామానికి చెందిన నెల్లూరి భాగ్య, కోమట్‌పల్లి గ్రామానికి చెందిన చీటూరి రాకేశ్ నాలుగు ఏండ్లుగా ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు వేర్వేరు కావడంతో కుటుంబ సభ్యులను ఎదురించి 2023 సంవత్సరం డిసెంబర్ 8వ తేదీన యాదగిరిగుట్టలో వివాహం చేసుకున్నారు. అనంతరం రక్షణ కల్పించాలని లింగంపేట పోలీసులను ఆశ్రయించారు. ఇరువురు మేజర్ కావడంతో పోలీసులు ఇరు కుటుంబాల సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో భాగ్య ఆరు నెలల గర్భిణి. అప్పటి నుంచి భార్యాభర్తలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. తనకు నడుం నొప్పి ఉన్నదని చెప్పడంతో రాకేశ్ ఆమెకు ట్యాబ్లెట్ ఇచ్చాడు. గతనెల 21వ తేదీన తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ భాగ్య నీలోఫర్ దవాఖానకు వెళ్లింది. వైద్యులు పరీక్షించి, గర్భంలోనే శిశువు మృతి చెందినట్లు చెప్పారు. మృత శిశువును తొలగించారు. తిరిగి ఇంటికి చేరుకున్న భార్యను రాకేశ్ వేధించడం ప్రారంభించాడు. నీవు తక్కువ కులం దానివని, నాకు వద్దు అంటూ వేధింపులకు గురిచేశాడు. ఇటీవల కేశాయిపేటకు తీసుకువచ్చి, వదిలేసి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి తప్పించుకొని తిరుగుతున్నాడు. రాకేశ్ శుక్రవారం కోమట్‌పల్లిలో ఉన్నట్లు తెలుసుకొని భాగ్య కుటుంబీకులతో కలిసి అతడి ఇంటికి చేరుకున్నది. అప్పటికే ఆయన తాళం వేసి వెళ్లిపోయాడు. తనకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని అక్కడే టెంట్ వేసుకొని బైఠాయించారు. అక్కడే వంట చేసుకున్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

బాన్సువాడ రూరల్, మార్చి 21 : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని బాన్సువాడ ఎక్సైజ్ సీఐ యాదగిరిరెడ్డి విద్యార్థుకు సూచించారు. మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో ఎస్ఎస్ఎల్ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోకైన్, గంజాయి, హెరాయిన్, ఆల్కహాల్, సిగరేట్ వంటి మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు సేవించినా, అక్రమ రవాణా చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుభాష్ గౌడ్, నెహ్రూ యువకేంద్రం వలంటీర్ సునీల్ రాథోడ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

మండల సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు

లింగంపేట(తాడ్వాయి)/ మాచారెడ్డి/ రాజంపేట, మార్చి 21: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు మహిళలకు సూచించారు. తాడ్వాయిలోని సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. మహిళల హక్కులు, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాలు, వెట్టి చాకిరి, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాచారెడ్డిలోని సమాఖ్య కార్యాలయంలో గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లకు సైబర్ నేరాలపై ఎస్సై అనిల్ శుక్రవారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు పాల్గొన్నారు. రాజంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, ఏపీఎం సాయిలు, సీసీలు బాగయ్య, సాయి, శ్రీనివాస్, రమేష్, స్వామి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి లత, గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

సోమారంలో శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

నాగిరెడ్డిపేట, మార్చి 21: పోచారం గ్రామ శివారులో ఉన్న పల్లె ప్రకృతి వనాన్ని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శుక్రవారం సందర్శించారు. ప్రకృతి వనాన్ని శుభ్రం చేశారు. మొక్కల చుట్టూ పాదులు తీసి నీరు పట్టారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. జీవన ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజితా శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఎన్ఎస్ఎస్ అధికారులు రంజిత, రమ్య, విఠల్, పరశురాములు, ఈజీఎస్ క్షేత్ర సహాయకురాలు స్వప్న, 127 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

సమాజ సేవలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి..

లింగంపేట(తాడ్వాయి), మార్చి 21: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆర్‌కే కళాశాలల కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి సూచించారు. తాడ్వాయి మండలం సోమారం గ్రామంలో ఎస్ఆర్‌కే కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వలంటీర్లు శ్రమదానం చేసి పలు వార్డులు శుభ్ర పరిచారు. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను గ్రామస్తులకు వివరించారు. ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ దత్తాత్రి, అకడమిక్ డీన్ నవీన్ కుమార్, ప్రోగ్రాం అధికారి మురళి, వలంటీర్లు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌కు జూనియర్ అసిస్టెంట్

నిజాంసాగర్, మార్చి 21: నిజాంసాగర్ ఎంపీడీవో కార్యాలయానికి ప్రభుత్వం కొత్తగా జూనియర్ అసిస్టెంట్‌ను నియమించింది. కారుణ్య నియామకాల్లో భాగంగా దోమకొండ పవన్‌కుమార్ శుక్రవారం విధుల్లో చేరారు. ఈ మేరకు తన జాయినింగ్ రిపోర్టును ఎంపీడీవో ప్రవీణ్‌కు ఆయన అందజేశారు.

ప్రమాద స్థల పరిశీలన

భిక్కనూరు, మార్చి 21 : మండలంలోని బస్వాపూర్‌లో ప్రమాద స్థలాన్ని అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న పల్లె దవాఖాన వద్ద ఇటీవల ఒక కార్మికుడు పనిచేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆ స్థలాన్ని ఆమె పరిశీలించారు.భవనం పక్కనగల విద్యుత్ వైర్లను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆమె వెంట ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

డెలివరీ చార్జీ పేరుతో గ్యాస్ ఏజెన్సీ మోసం

మాచారెడ్డి, మార్చి 21 : మండలంలోని ఓ గ్యాస్ కంపెనీ ఏజెన్సీ డెలివరి చార్జీ పేరుతో వినియోగదారులను మోసం చేస్తున్నదని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు రమేశ్ ఆరోపించారు. మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న అక్కాపూర్ గ్రామంలో గ్యాస్ సిలిండర్‌ను డెలివరీ చేసి రూ.877 కుగాను రూ.920 వసూలు చేస్తున్నారని, అదనంగా రూ.43 తీసుకుంటున్నారని అన్నారు. కనీసం బరువు కూడా చెక్ చేసి ఇవ్వడం లేదని అన్నారు. ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న వినియోగదారుల వద్ద డెలివరీ చార్జీలు వసూలు చేయవద్దని గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

బాన్సువాడ, మార్చి 21 : ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంటను నాణ్యతా ప్రమాణాలు పాటించి కోతలు చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. బాన్సువాడలో సివిల్ సప్లై డీఎం, డీసీఏ, ట్రాన్స్‌పోర్టు అధికారులు , ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ శాస్త్రవేత్త అనిల్‌రెడ్డితో కలిసి సంయుక్తంగా కోత మిషన్ యజమానులు, డ్రైవర్లు, ఏజెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరికోత మిషన్లు ఎకరం పంటను గంటాపదిహేను నుంచి గంటన్నర సమయంలో కోసేలా చర్యలు తీసుకోవాలన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు ఉన్న ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని తెలిపారు. అనంతరం సన్నరకం వరి పంట అయిన గంగాకావేరి గింజ పొడువు, వెడల్పు తదితర అంశాలపై మూడు మండలాల రైతులు, గంగాకావేరి కమిటీ సభ్యులు మిర్జాపూర్ సొసైటీ మాజీ అధ్యక్షుడు మారుతి, మంత్రి గణేశ్, కిశోర్ బాబుతో చర్చించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ మాల్తుమ్మెద, శాస్త్రవేత్త అనిల్ కుమార్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లై డీఎం రాజేందర్, డీసీఎస్‌వో మల్లికార్జున్, బాన్సువాడ ఏడీఏ అరుణ, బాన్సువాడ వ్యవసాయాధికారి మహ్మద్ పాయిదుల్లా, వ్యవసాయ విస్తీర్ణాధికారులు, కోత మిషన్ ఏజెంట్లు, యజమానులు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యానికి కొలతలు

బాన్సువాడలోని నాగులగామ వెంకన్న రైసుమిల్, మండలంలోని రాంపూర్ గ్రామంలో వరికోతలు చేపట్టిన రైతుల గంగాకావేరి ధాన్యాన్ని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. నేరుగా రైతుల వద్దకు వెళ్లి గ్రెయిన్ పారా మీటర్ ద్వారా ధాన్యం గింజ పొడువు, వెడల్పు కొలతలను ఆర్డర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టారు.

ముందస్తు చర్యలు చేపట్టాలి

కామారెడ్డి, మార్చి 21 : ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి కామారెడ్డి పట్టణ, నియోజకవర్గంలో తాగునీటి సమస్యలపై అధికారులతో శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య పరిష్కరించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ ఏరియాల అవసరం మేరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. మిషన్ భగీరథ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల ద్వారా చేపడుతున్న పనులపై ఆయన సమీక్షించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కామారెడ్డి, మార్చి 21 : మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇస్లాంపుర కాలనీలో ఉన్న కమ్యూనిటీ మీడియేషన్, కేఆర్‌కే సన్ ఫైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లల్ని బాగా చదివించాలని సూచించారు. అనంతరం చిన్నారులకు నిత్యావసర సరుకులు, పండ్లు పంపిణీ చేశారు. సీఎంవీ ఖలీల్ ఉల్లాహ్, స్వప్న, న్యాయ సేవా సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైనవారు ఇండ్లు నిర్మించుకోవాలి

బాన్సువాడ రూరల్, మార్చి 21 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించాలని డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి సూచించారు. బాన్సువాడ మండలం నాగారంలో ఎంపీడీవో బషీరుద్దీన్‌తో కలిసి శుక్రవారం పర్యటించారు. ఆయన వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శులు నవీన్‌గౌడ్, సృజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాచప్ప, గ్రామ పెద్దలు దొడ్ల వెంకట్రాంరెడ్డి ఉన్నారు.

కంటైనర్ డ్రైవర్‌పై దాడి

భిక్కనూరు, మార్చి 21: చెక్‌పోస్టు వద్ద కంటైనర్ (లారీ)ను ఆపకపోవడంతో కొందరు వెంబడించి భిక్కనూర్ టోల్ ప్లాజా వద్ద పట్టుకొని డ్రైవర్‌పైదాడికి దిగారు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. నాందేడ్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ కంటైనర్ మండలంలోని జంగంపల్లి చెక్‌పోస్టు వద్ద ఆపాలని సిబ్బంది సిగ్నల్ ఇచ్చారు. సిగ్నల్‌ను పట్టించుకోకుండా సదరు కంటైనర్ డ్రైవర్ ముందుకెళ్లి పోయాడు. దీంతో ఆగ్రహానికి గురైన సిబ్బంది కారులో వెంబడించి భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద కంటైనర్ డ్రైవర్‌పై దాడి చేశారు. దాడిలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్ డయల్ 100 కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని డ్రైవర్‌ను స్టేషన్‌కు, లారీని చెక్‌పోస్టుకు తరలించారు.

చలివేంద్రం ప్రారంభం

మాచారెడ్డి, మార్చి 21 : మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఖాసీంఖాన్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాచారెడ్డి ఎస్సై అనిల్ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో అలీఖాన్, రఫ్ఖాన్, బాబాఖాన్, మహబూబ్‌ఖాన్, అష్రాఫ్‌ఖాన్, ఖలీల్, అబ్దుల్లా, అభిషేక్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎండల నుంచి మొక్కలను కాపాడాలి

తిమ్మాపూర్ నర్సరీని పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 21: తీవ్రంగా ఉన్న ఎండల నుంచి మొక్కలను కాపాడాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ నర్సరీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సరీల్లోని మొక్కలకు నీళ్లు పట్టాలన్నారు. మొక్కల మధ్య పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలన్నారు. ప్రైమరీ బెడ్లలో జర్మినేషన్ జరిగేలా చూడాలన్నారు. ఆయనవెంట ఎంపీడీవో ప్రకాశ్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, నర్సరీ సిబ్బంది ఉన్నారు.

కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి మార్కింగ్

మార్కింగ్ ఇస్తున్న అధికారులు

లింగంపేట, మార్చి 21: లింగంపేటలోని నాగన్న బావి వద్ద కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణానికి శుక్రవారం మార్కింగ్ చేసినట్లు ఎంపీడీవో నరేశ్ తెలిపారు. నాగన్న బావి వద్దకు వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మిస్తున్నామని అన్నారు. మూడు లక్షల రూపాయలతో చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మలహరి, ఏపీవో నరేందర్, ఈసీ రాజు, పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తల నిరసన

లింగంపేటలో నిరసన వ్యక్తంచేస్తున్న ఆశ కార్యకర్తలు

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి రూరల్/ రామారెడ్డి/ లింగంపేట/ మాచారెడ్డి, మార్చి 21: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు శుక్రవారం నిరసన వ్యక్తంచేశారు.ఎల్లారెడ్డి, రామారెడ్డి, లింగంపేట, మాచారెడ్డిల్లోని పీహెచ్‌సీల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. 45,46వ ఐఎల్‌సీ సిఫార్సుల ప్రకారం ఆశ వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం పెన్షన్, ఇతర సామాజిక భద్రతా ప్రయోజనాలను కల్పించాలన్నారు. విధి నిర్వహణ కోసం స్కూటీలను ఇవ్వడంతోపాటు ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే భరించాలన్నారు. అన్ని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ జిల్లా, రాష్ట్ర దవాఖానల్లో విశ్రాంతి కోసం గదులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య సేవల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. లేబర్ కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన ప్రసూతి, క్యాజువల్, మెడికల్ సెలవులు ఇవ్వాలన్నారు. తమను మూడో తరగతి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కార్మిక చట్ట పరిధిలోకి తేవాలని కోరారు.

ఎల్లారెడ్డి మండలం మత్తమాల పీహెచ్‌సీ వద్ద చేపట్టిన నిరసనలో ఆశ వర్కర్ల మండల అధ్యక్షురాలు మంజుల, ఆశ వర్కర్లు సంధ్య, లావణ్య, అంజమణి, సుశీల, భాగ్య పాల్గొన్నారు. రామారెడ్డి పీహెచ్‌సీ ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు ఉసికె శాంతమ్మ, కాసర్ల ప్రమీల తదితరులు పాల్గొన్నారు. లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు స్వరూప, కార్యకర్తలు పద్మ, సావిత్రి, రాజమణి, చంద్రకళ, వీరమణి, స్వప్న, సుజాత తదితరులు పాల్గొన్నారు. మాచారెడ్డిలోని ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశవర్కర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

నాగిరెడ్డిపేటలో మాట్లాడుతున్న ఏపీడీ మురళీకృష్ణ

లింగంపేట/ నాగిరెడ్డిపేట/ ఎల్లారెడ్డి రూరల్, మార్చి 21: మానవ అక్రమ రవాణా నేరమని ఏపీడీ మురళీ కృష్ణ అన్నారు. లింగంపేటలోని రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన మండలంలోని ఆయా గ్రామాల మహిళా సమాఖ్య అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కేంద్రం తీసుకు వచ్చిన నూతన చట్టాలు, లైంగికదాడుల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సులోచన, సీసీలు రాజిరెడ్డి, మెహర్, గంగరాజు, నజీర్, శ్రావణ్, స్వప్న, అంజయ్య, మన్సూర్, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేటలోని మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీడీ మురళీకృష్ణ మాట్లాడుతూ.. మహిళలపై లైంగిక దాడులు, అక్రమ రవాణా, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై హెచ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. సైబర్ నేరాలనికి గురైతే వెంటనే 1930నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు శాంత, ఏపీఎం జగదీశ్, అకౌంటెంట్ రాజు, ఆయా గ్రామ సమాఖ్యల అధ్యక్ష, కార్యదర్శులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీడీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై మహిళా సంఘాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్నారాణి, సీసీలు సుజాత, గోపాల్, శ్రీను, రవి, సంధ్య, సావిత్రి, అకౌంటెంట్ మహేశ్, ఆయా గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏలు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 21: మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులను నాయకులు శుక్రవారం ప్రారంభించారు. సీసీ రోడ్ల పనుల కోసం ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో నాయకులు సాయిబాబా, గురుప్రతాప్, రామాగౌడ్, గంగారెడ్డి, కృష్ణారెడ్డి, గోపీ కిరణ్, తేజ, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుంకిపల్లిలో..

నిజాంసాగర్, మార్చి 21: మహ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. మండలంలో రూ.కోటీ 35లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుమ్మరి రాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మార్వాడి సమాజ్ ఆధ్వర్యంలో శీతల్

పూజ చేస్తున్న మార్వాడీ మహిళలు

మద్నూర్, మార్చి21:మండలకేంద్రంలో శుక్రవారం రాజస్థాన్ మార్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం శీతల్ నిర్వహించారు. గ్రామదేవత పోచమ్మ ఆలయంలో ప్రత్యేకపూజలుచేసి నైవేద్యం సమర్పించారు. హోలీ పండుగ అనంతరం వచ్చే శుక్రవారం ఈ ఉత్సవం నిర్వహిస్తామని చెప్పారు. ఆ రోజు ఇండ్లలో పొయ్యి వెలిగించమని, ముందు రోజు వండిన పదార్థాలనే తింటామని చెప్పారు. ఇది ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం అని పేర్కొన్నారు.

పదవీ కాలం పొడగింపు

లింగంపేట, మార్చి 21: లింగంపేట సహకార సంఘ పాలకవర్గ పదవీ కాలం ఆరు నెలలు పొడగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘం చైర్మన్ దేవేందర్‌రెడ్డి స్థానిక సహకార సంఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఫిబ్రవరి నెలలో పదవీ కాలం ముగిసిందని, ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడగించడంపై కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

రామారెడ్డి (సదాశివనగర్), మార్చి 21: ఎస్సీ రాకేశ్‌చంద్ర ఆదేశాల మేరకు సదాశివనగర్ మండలంలోని మర్కల్ జంక్షన్ వద్ద సీఐ సంతోష్, ఎస్సై రంజిత్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి జరిమానా విధించారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

నీటి చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు

లింగంపేట, మార్చి 21: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి చౌర్యానికి పాల్పడితే పోలీసు కేసులు నమోదు చేయిస్తామని మండల పంచాయతీ అధికారి మలహరి, మిషన్ భగీరథ ఏఈ విష్ణు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని సురాయిపల్లి, ఎర్రోళ్ల తండా, జగదంబ తండా, కొట్టాల్ గడ్డ తండాలకు చెందిన పలువురు రైతులు మిషన్ భగీరథ పైప్‌లైన్ (గ్రిడ్)కు అమర్చిన ఎయిర్ వాల్స్ నుంచి నీటి చౌర్యానికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నీటి చౌ ర్యానికి పాల్పడి ఎద్దడి సృష్టించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-330663-All

BUILDING FOR SALE

★New RCC Building 2BHK ,H:No 4-2-21 built in 484Sq.yard plot for Sale @ 70 Lacs, near :DSP Office, Opp: Vani Vidyanikethan School, Shakar Nagar, Bodhan, Mob: 9960996111. Gulf NRI's , Employees, Business person can contact directly.
NTZ-338564

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర